

యాత్రను విజయవంతం చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి పిలుపునిచ్చారు. - 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శనివారం సాయంత్రం)

సహర్ 4-54 (ఆదివారం ఉదయం)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36°/23°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ సీఎంఆర్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : 2021– 22 యాసంగి సీజన్‌లో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను ఈనెల 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని డీఎస్‌ఓ వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎఫ్‌సీఐ గోదాంను ఆయన సందర్శించారు. అనంతరం మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 91శాతం, మిర్యాలగూడలో 92 శాతం సీఎంఆర్ పూర్తయిందన్నారు. మిగతాది ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, బండారు కుశలయ్య, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

నల్లగొండ టౌన్ : క్షయ వ్యాధి నిర్మూలనకు అంతా సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిమల్ల కొండల్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నిర్మూలణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గడియారం సెంటర్ నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గడియారం సెంటర్‌లో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని క్షయను తరిమివేసి క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చి రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్షయ నిర్మూలణ కోసం కృషి చేసిన డాక్టర్లకు, సిబ్బందికి ప్రశంస పత్రాలను, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, పుల్లారావు, హరికృష్ణ, రవిప్రసాద్, దీపా, శమియోద్దీన్, వర్షిత్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్లూ మార్చ్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

నల్లగొండ టౌన్ : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించే బ్లూ షర్ట్స్, బ్లూ మార్చ్‌లో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, దళిత సంఘాల జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వడ్డెబోయిన సైదులు, కె.గోవిందరావు, ఓగోటి శంకర్, కొండల్, మహేష్, దివాకర్, సైదులు, కోటేష్, మహేష్, చింత క్రాంతి, రాంబాబు ముత్యాలు, వినోద్, అమీర్, నాగరాజు, మణి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

నల్లగొండ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్–బీ, జ్యూయాలజీ– 2, హిస్టరీ– 2 పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా సాగింది. మొత్తం 12,776 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 12,420 మంది హాజరయ్యారు. 356 మంది గైర్హాజరయ్యారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శనివారం నిర్వహించనున్న నిరుద్యోగ మహాధర్నాకు జిల్లాలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని కోరారు.

పైసలిస్తేనే.. ప్రాసెస్!

వాహనాల రిజిస్ట్రేషన్లలో ముడుపుల దందా!

- ముక్కు పిండి వసూలు చేస్తున్న వాహన డీలర్లు
- ఆన్‌లైన్ విధానం వచ్చినా తప్పని అదనపు చెల్లింపులు
- ఒక్కో వాహనానికి రూ.1000 చొప్పున.. నిత్యం రూ.50 వేలుపైనే..
- ఓపెన్ నంబర్లలో ఇష్టమైనది ఇచ్చేందుకూ అమ్యామ్యాలే..

నల్లగొండలో ఇటీవల శ్రీనివాస్ అనే వ్యక్తి ఓ డీలర్ వద్ద కారు కొనుగోలు చేశారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్), పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్, స్మార్ట్ కార్డు పేరుతో మొత్తం కలిపి రూ.4 వేలు వాహన కొనుగోలుదారుని వద్ద డీలరు వసూలు చేశాడు. ఇక పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ సమయంలో మరో రూ.1000 అదనంగా వసూలు చేశారు. ఫైల్ ప్రాసెస్ పేరుతో మరో రూ.వెయ్యి మొత్తంగా దాదాపు రూ.2 వేలు ప్రతి వాహన కొనుగోలుదారుని నుంచి వసూలు చేస్తున్నారు. ఇలా ఆర్టీఏ కార్యాలయంలో ప్రతిరోజూ రిజిస్ట్రేషన్ అయ్యే 50 వాహనాల నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష అదనపు వసూళ్ల పర్వం కొనసాగుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో వాహనాల రిజిస్ట్రేషన్లలో ముడుపుల దందా జోరుగా సాగుతోంది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే చాలు అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోంది. ముడుపులిస్తేనే ఆర్టీఏ కార్యాలయంలో ఏ పనికైనా ప్రాసెస్ చేస్తారంటూ డీలర్లు చెబుతుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాహనదారులు ముట్టజెప్పక తప్పడం లేదు. అలా వచ్చిన మొత్తాన్ని ఆర్టీఏ కార్యాలయంలో కొందరు అధికారులు, సిబ్బంది పంచుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేకాదు డ్రైవింగ్ స్కూళ్ల తరఫున లైసెన్స్ ఇప్పించే క్రమంలోనూ, ఓపెన్ నంబర్లలోనూ ఇష్టమైన నంబర్ ఇచ్చేందుకు ముడుపులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్ విధానం వచ్చినా తప్పని బాదుడు

రవాణా శాఖ (ఆర్‌టీఏ) కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం అమల్లోకి తెచ్చింది. అయినా వారి ముడుపుల దందా మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అంతా ఆన్‌లైన్‌లోనే అని చెబుతున్నా నల్లగొండ ఆర్టీఏ కార్యాలయం ఎదురుగానే ఏజెంట్ల దందా జోరుగా సాగిస్తున్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు చొప్పున వాహనదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానం వచ్చినా, కొత్తగా కొనుగోలు చేసిన వాహనాన్ని డీలరే రిజిస్ట్రేషన్ చేయించేలా నిబంధనను విధించింది. తద్వారా వాహనదారుడికి అదనపు చెల్లింపులు తప్పుతాయని భావించింది. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందే విషయంలోనూ అవినీతికి ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ చేసినా ముడుపుల బాగోతం సాగుతూనే ఉంది.



జిల్లా రవాణా శాఖ కార్యాలయం

ఓపెన్ నంబర్ల కేటాయింపులో ఇష్టారాజ్యం

సాధారణంగా ఆర్టీఏ ఫ్యాన్సీ నంబర్లు కేటాయించే క్రమంలో ఆన్‌లైన్ రిజర్వేషన్ విధానం తీసుకొచ్చింది. నంబర్ల కేటగిరీని బట్టి రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు చెల్లించి రిజిస్టర్ చేసుకునేలా చర్యలు చేపట్టింది. నిర్దేశిత సమయంలో నిర్వహించే ఆన్‌లైన్ వేలంలో ఆయా నంబర్లకు అంతకుమించి కోట్ చేస్తే ఆ నంబర్‌ను వారికి కేటాయిస్తోంది. ఇవి పోగా మిగితా నంబర్లను రూ.5వేల కేటగిరీలో పెడుతోంది. అందులో ఇష్టమైన నంబర్‌ను రూ.5వేలు చెల్లించి తీసుకోవచ్చు. అలాంటివి పోగా మిగితా నంబర్లను ఓపెన్‌లో పెడుతోంది. వాటిని వేలంలో పాల్గొనని వారికి, రూ.5వేలు చెల్లించని వారికి కేటాయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు.

కొనుగోలుదారుల నుంచి వసూలు చేస్తున్న డీలర్లు

కొత్తగా వాహనాలు కొనుగోలు చేస్తే వాహనం ధర చెల్లించి కొనుగోలు చేశాక వాహన రిజిస్ట్రేషన్, ఇన్స్‌రూ ప్రత్యేకంగా చేయించుకునేవారు. ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చాక వాహన కొనుగోలు సమయంలోనే వాహన ధరతోపాటు, ఇన్స్‌రూ రిజిస్ట్రేషన్ ఫీజును డీలర్లే వసూలు చేస్తున్నారు. ముందుగా టీఆర్ ఇప్పిస్తున్న డీలర్లు ఆ తరువాత నెల రోజుల్లోపు పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ సమయంలో మళ్లీ రూ.1000 నుంచి రూ.1,500 వరకు కొనుగోలుదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

అదనంగా వసూలు చేయడానికి వీల్లేదు



కొత్త వాహనం కొన్నప్పుడు రూ.300 టెంపరరీ రిజిస్ట్రేషన్ ఫీజు, లోన్ తీసుకుంటే హైపతికేషన్ ఫీజు రూ.1,500, నంబర్ ప్లేట్, స్మార్ట్ కార్డు కలుపుకొని పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,235 మాత్రమే వాహనాదారులు చెల్లించాలి. మొత్తంగా డీలర్లు రూ.3,035లకు మించి వసూలు చేయడానికి వీల్లేదు. అలా వసూలు చేస్తే చర్యలు చేపడతాం. వాహనదారులు స్లాట్ బుక్ చేసుకొని పూర్తి స్థాయి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

– సురేష్‌రెడ్డి, ఆర్టీఓ, నల్లగొండ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు

రైతాంగాన్ని రక్షించేందుకే బీఆర్‌ఎస్

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : దేశంలో రైతాంగాన్ని రక్షించడానికి కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మి గార్డెన్స్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కావాలని దేశవ్యాప్తంగా ఉన్న రైతులు కోరుకుంటున్నారని చెప్పారు. హస్తినలో రైతులు చేసిన పోరాటాలు కేసీఆర్‌ను కదిలించించాయన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్రంలో నిరంతరం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో నల్లగొండ జిల్లా అద్భుత ప్రగతిని సాధించని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. డీసీసీబీ పాలకవర్గం, ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి ప్రగతిపథంలో ముందుంచినందుకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గాన్ని, ఉద్యోగులను మంత్రి అభినందించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పురోగాభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని అభినందిస్తున్నామన్నారు.



పాల్గొన్న పీఏసీఎస్ చైర్మన్‌లు, ఉద్యోగులు

రూ.2200 కోట్ల టర్నోవర్..

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన మూడేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా రూ.2200 కోట్ల టర్నోవర్‌లో సాధించామని చెప్పారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎం వాహనాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్‌రావును పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల రామక్రిష్టారెడ్డి, దూదిమెట్ల బాలరాజు, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య, నార్మాక్స్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోతె సోమిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆల్డా చైర్మన్ మొతె పిచ్చిరెడ్డి, సీఈఓ కె.మదన్‌మోహన్, డైరెక్టర్లు పాశంసంపత్‌రెడ్డి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నల్లగొండలోని ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

- ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

నల్లగొండ : ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జీతాలు, ఈ కుబేర్ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు సోమయ్య, రాజశేఖర్‌రెడ్డి, నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నల్లగొండ ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారు తెలంగాణలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు అందడం లేదన్నారు. మూడు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర ఉపాధ్యాయుల సప్లమెంటరీ వేతనాలు, పీఆర్సీ, మెడికల్, పెన్షనరీ బకాయిలు, జీపీఎఫ్, టీఎస్జీఎల్‌ఐ క్లెయిములు ట్రెజరీలలో ఆమోదం పొందినా.. ఏడు నెలలుగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయని పక్షంలో 28వ తేదీన రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకులు ఎడ్ల సైదులు, పి.వెంకటేశం, ఖుర్షీద్ మియా, పి.వెంకులు, పి.ఏడుకొండలు, బి.అరుణ, నర్రా శేఖర్‌రెడ్డి, రామలింగయ్య, జి.అరుణ, నరసింహ, ఆర్.రమాదేవి, ఎస్.వెంకన్న, యాదగిరి, వరలక్ష్మి, బి.వెంకటేష్, జగతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

నల్లగొండ : ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కంటి వెలుగు, ఇంటర్, పదో తరగతి పరీక్షలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అనంతరం అక్కడే కలెక్టర్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. కంటి వెలుగు ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని, ఆరోగ్య మహిళ కింద అందించే సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 కింద పెండింగ్‌లో ఉన్న రుసుము చెల్లింపులపై రెవెన్యూ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్‌లో చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, డీఎఫ్ఓ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రూనాయక్, ఉద్యానవన శాఖ అధికారిణి సంగీతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నేడు నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్ చంద్ర తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించే ధర్నా కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహించే ధర్నాలో పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వాడపల్లి రమేష్, పులి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో సేవా కేంద్రాలు

రామగిరి(నల్లగొండ) : బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు మార్చి 26 ఆదివారం, 30న శ్రీరామ నవమిరోజున కస్టమర్ సేవా కేంద్రాల్లో బిల్లులు చెల్లించుకోవచ్చని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల జనరల్ మేనేజర్ పి.వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు బిల్లులు అందకపోతే కస్టమర్ సేవా కేంద్రాల వద్ద నకిలీ బిల్లులు పొందవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా వినియోగదారులు ఎస్ఎంఎస్ ద్వారా బిల్లులు పొందేందుకు ఈ మెయిల్ ఐడీలు, మొబైల్ నెంబర్లను అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలో పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 58 ద్వారా పట్టణంలోని 3వ వార్డుకు చెందిన పది మంది అర్హులకు శుక్రవారం ఆయన ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, రాష్ట్ర ఆగ్రోస్ డెవలప్‌మెంట్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డిలతో కలిసి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల అవసరాలను, ఇబ్బందులను గుర్తించడంతోపాటు రాష్ట్ర ప్రగతి కోసం అవసరమయ్యే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, కౌన్సిలర్ బంటు రమేష్, నాయకులు షేక్ నాగుల్‌బాబా, బోగబోయిన రాజు, చింతల వెంకటేశ్వర్లు, అలకాని రమణ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

- అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

రామగిరి(నల్లగొండ) : నర్సరీల్లో మొక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు అవసరమని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం మండలంలోని దుప్పలపల్లి, తిప్పర్తి, నూకలవారిగూడెం, సర్వారం, పజ్జూరులో నర్సరీలు, డంపింగ్ యార్డులు, ఉపాధి హామీ, మన ఊరు – మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వందశాతం మొక్కలను పెంచాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను ఆదేశించారు. పూలు, పండ్లనిచ్చే అన్ని రకాల మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనిశెట్టిదుప్పలపల్లి బొప్పరాజు కుంట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి.. చేసిన పనులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి కూలీలకు నగదు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ఏపీడీలు బాలకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, ఎంపిడీఓ మహేందర్‌రెడ్డి, ఎంపీఓ నర్సింహస్వామి, ఎంఈఓ అరుంధతి, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.



అనిశెట్టి దుప్పలపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

107 కేంద్రాలు.. 19,414 మంది

- పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం
- ఈ సారి ఆరు పేపర్లు, ఐదు నిమిషాల మినహాయింపు
- జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు, సిబ్బందికి శిక్షణ పూర్తి
- 'సాక్షి'తో డీఈఓ భిక్షపతి

నల్లగొండ : ×పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా 107 కేంద్రాల్లో 19,414 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 13వ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. అయితే ఈ సారి పరీక్ష కేంద్రంల లోపలికి అనుమతించేందుకు ఐదు నిమిషాల సడలింపు ఇచ్చారు.



డీఈఓ భిక్షపతి

కానీ, గతంలో విద్యార్థులు ప్రశ్నపత్రం చదువుకునేందుకు ఇచ్చే 15 నిమిషాల సమయాన్ని తొలగించారు౽ అని డీఈఓ భిక్షపతి తెలిపారు. టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన ×సాక్షి౽తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పరీక్షకు 19,414 మంది విద్యార్థులు..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి మొత్తం 19,414 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యూలర్ విద్యార్థులు 19,234 మంది, ఒకసారి ఫైయిల్ అయిన వారు 180 మంది ఉన్నారు. పరీక్షలకు 107 కేంద్రాలు ఏర్పాటు చేశాం. అందులో దేవరకొండలో ఒక ప్రైవేటు పాఠశాలలో కూడా కేంద్రం ఉంది. పరీక్షలకు సంబంధించి అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. చీఫ్ సూపరింటెండెంట్లు 107 మంది, డీఓలు 107 మంది, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లను కూడా నియమించాం. ఇన్విజిలెటర్లకు కూడా మండల స్థాయిలో శిక్షణ ఇస్తాం.

కేంద్రాల్లో సీసీ కెమెరాలు..

ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటి పర్యవేక్షణలోనే పశ్నపత్రాలను ఓపెన్ చేస్తారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో డ్యూయల్ డెస్కులు, తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు.

జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు..

పదోతరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరాయి. వాటిని డీఈఓ కార్యాలయంలో పోలీస్ బందోబస్తు మధ్య భద్రపరిచాం. శనివారం పోలీస్ బందోబస్తు మధ్య ఆయా పరీక్ష కేంద్రాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు తరలిస్తాం. పరీక్ష రోజు గంట ముందుగానే కస్టోడియన్లు పోలీస్ సిబ్బందితో కలిసి ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్..

విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాం. www.bsctelangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో పరీక్షకు అనుమతిస్తాం. పరీక్ష కేంద్రాలకు వచ్చే ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తోపాటు ఇతర సిబ్బంది ఎవరికి కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదు. ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డును ధరించి కేంద్రాలకు హాజరుకావాలి.

12 సీ సెంటర్లు..

జిల్లాలో 107 పరీక్ష కేంద్రాల్లో.. 12 సీ సెంటర్లుగా గుర్తించాం. అక్కడ ట్రెజరీ, పోలీస్‌స్టేషన్ లేవు. ఆ సెంటర్లకు ప్రశ్నపత్రాలను కస్టోడియన్లు, పోలీస్ సిబ్బంది ద్వారా ముందుగానే తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. అక్కడ రెవెన్యూ సిబ్బందిని కూడా సిట్టింగ్ స్క్వాడ్‌గా ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆయా రూట్లలో పరీక్ష కేంద్రాలకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరాం. అందుకు సంబంధించి జాబితాను కూడా అందించాం.

ఆందోళన వద్దు..

విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి భయాందోళనలకు గురి కావొద్దు. పరీక్ష కేంద్రాలకు తల్లిదండ్రులు ఒకరోజు ముందుగానే పిల్లలను తీసుకెళ్లి చూపించాలి. తద్వారా పరీక్ష రోజు ఎలాంటి ఇబ్బందులు కలగవు.

క్లుప్తంగా

తొమ్మిది ఆవుదూడల పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఆవుదూడలను శుక్రవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా తుని నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వాహనంలో ఆవుదూడలను తరలిస్తుండగా మార్గ మధ్యలోని రామాపురం క్రాస్‌రోడ్‌లోని చెక్ పోస్ట్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వాటిని హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి డీసీఎం డ్రైవర్ దేవపు నానితో పాటు యజమాని దేమల్లుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బీబీనగర్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుర్రాలదండి గ్రామ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రాలదండి పరిధిలోని కుచ్చుబోడు తండాకు చెందిన ధారావత్ యాదు(45) చిన్నరావులపల్లి పరిధిలోని హిందుస్థాన్ పరిశ్రమల్లో పనిచేస్తున్నాడు. కాగా యాదు ఉదయం తండా సమీపంలో గల శ్రీకర టెక్స్‌టైల్స్ పరిశ్రమ వెనుక భాగంలో గల మూసీ వాగులో చేపలు పట్టేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. పరిశ్రమ వెనుక భాగంలో గల విద్యుత్ వైర్లకు సరఫరా అవుతుండడంతో వాటికి తగిలిన యాదు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు



సాక్షి పేపర్ బాయ్స్‌కు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి సిబ్బంది



నల్లగొండలోని యూనిట్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సాక్షి సిబ్బంది

- సాక్షి దినపత్రిక సేవలు అభినందనీయం
- భువనగిరి కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పనిచేస్తాయని, అందులో సాక్షి దినపత్రిక సేవలు అభినందనీయమని భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సాక్షి 15 వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆమె అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డి.శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కేక్ కట్ చేశారు. సాక్షి పేపర్ బాయ్స్‌కు బహుమతులు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సాక్షి దినపత్రిక ప్రజల్లోకి మరింతంగా వెళ్లాలని ఆకాక్షించారు. సాక్షి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఉదయాన్నే లేచి ఇంటింటికి పేపర్ వేసే బాయ్స్‌ని ఆమె అభినందించారు. ప్రతి రోజు ఉదయం పేపర్ వేస్తూ.. విద్యాభ్యాసం కొనసాగిస్తున్న పేపర్ బాయ్‌ల కంటే స్ఫూర్తి ప్రదాతలు ఎవరుంటారని కొనియాడారు. అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం కూడా పేపర్ వేసి చదువుకుంటూ రాష్ట్రపతిగా ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి నాగేశ్వరాచారి, సాక్షి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ యంబ నర్సింహులు, రిపోర్టర్లు, సాక్షి సిబ్బంది ఎం.వెంకటేశ్, కల్లెం సంపత్, భరత్, అశోక్, రావులరాజు, వనం రాజు, ఫొటో గ్రాఫర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ యూనిట్ కార్యాలయంలో..

రామగిరి(నల్లగొండ): సాక్షి 15 వార్షికోత్సవం శుక్రవారం నల్లగొండ యూనిట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సాక్షి కుటుంబ సభ్యులంతా కలిసి 15కిలోల కేక్ కట్ చేశారు. ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది మాట్లాడు తూ.. సాక్షి స్థాపించిన నాటి నుంచి సంస్థతో వారి కున్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, ఎడిషన్ ఇన్‌చార్జి బి.జనార్దన్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి సిహెచ్.గణేష్, భువనగిరి స్టాఫ్ రిపోర్టర్ నర్సింహులు, యాడ్స్ మేనేజర్ వెంకన్న, సర్క్యులేషన్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, ప్రొడక్షన్ అసిస్టెంట్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్, స్టోర్స్ ఇన్‌చార్జులు హరిబాబు, మల్లేష్, ఫొటోగ్రాఫర్లు భజరంగ్ ప్రసాద్, యాకయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు

దేవరకొండ : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలను వివరించారు.ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని పేర్కొన్నారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిండి సర్కిల్ సీఐ పరశురాం, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇంచార్జ్ సంతోష్, ఎస్ఐ సతీష్,తదితరులున్నారు.



కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

కాపురానికి తీసుకెళ్లాలని నిరాహార దీక్ష

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : భర్త తనను కాపురానికి తీసుకెళ్లాలని కోరుతూ ఓ మహిళ తన చంటిపాపతో మండలంలోని ఏనుబాముల స్టేజీ వద్ద గల ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ గేటుకు శుక్రవారం తాళం వేసి నిరాహార దీక్షకు దిగింది. మండలంలోని నెమ్మికల్‌కు చెందిన జటంగి రామనర్సు కూతురు అనూషను 2020 ఫిబ్రవరిలో మామిళ్లమడవకు చెందిన కొర్వి వీరన్న కొడుకు ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరి కాపురం ఏడాదిన్నర పాటు సజావుగా సాగింది. వీరికి కూతురు జన్మించింది. అనంతరం దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఏడాది కాలంగా అనూష తన పాపతో కలిసి పుట్టింట్లోనే ఉంటుంది. పలుమార్లు పెద్ద మనుషులు పంచాయితీ చేసినా మెట్టింటి వారు అనూషను తీసుకెళ్లడం లేదు. దీంతో అనూష తన పాపతో కలిసి భర్తకు చెందిన ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ గేటుకు తాళం వేసి నిరాహార దీక్షకు దిగింది. తనకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తానని తెలిపింది. ఆమె దీక్షకు మద్దతుగా నెమ్మికల్‌కు చెందిన పలువురు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి న్యాయం చేయాలని నినాదా లు చేశారు. కార్యక్రమంలో అనూష తల్లిదండ్రులు జటంగి రామనర్సు, గణిత, కుటుంబ సభ్యులు జటంగి నాగయ్య, మల్లేష్, స్వామి, లింగమ్మ ఉన్నారు.



భర్త ఫంక్షన్‌హాల్ ఎదుట నిరసన తెలుపుతున్న అనూష, కుటుంబ సభ్యులు

పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయాలి

సూర్యాపేటటౌన్: కొన్ని నెలలుగా ఈ కుబేర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు సోమయ్య, కృష్ణారెడ్డి, లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, సరెండర్ వేతనాలు, జీపీఎఫ్ అప్పులు, పార్ట్ ఫైనల్, ఫైనల్ పేమెంట్లు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల మూడు నెలల వేతనాలు మంజూరు చేయకుండా ఈ కుబేర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 28 లోపు బిల్లులన్నీ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.అనిల్‌కుమార్, ముత్తయ్య, భిక్షపతి, బీవీ రావు, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, సీహెచ్.వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సుభాని పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

హుజూర్‌నగర్: వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లోని చింతలబజార్‌కు చెందిన రేపన జానకమ్మ చిన్న కుమార్తె రెపన శాంతికి ఆరేళ్ల క్రితం నాగార్జునసాగర్‌కు చెందిన కృష్ణంరాజుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం కాగా, శాంతికి ఆరోగ్యం బాగోలేక నెల రోజులుగా పట్టణంలోని తల్లి వద్దనే ఉంటుంది. ఆమె భర్త కృష్ణరాజు ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటున్నాడు. అయితే, శుక్రవారం శాంతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శాంతి (ఫైల్)

'బస్వాపురం' నిర్వాసితుల వినూత్న నిరసన

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్‌తండా వాసులు చేపట్టిన దీక్ష తొమ్మిదో రోజు కొనసాగింది. శుక్రవారం వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రిజర్వాయర్‌లో సర్వస్వం కోల్పోతున్నామని, ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తి కావొస్తున్నా పరిహారం చెల్లించడం లేదన్నారు. మూడేళ్లవుతున్నా పునరావాస గ్రామంలో పనులు కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యా నాయక్, బిచ్చానాయక్ పాల్గొన్నారు.



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న లప్పానాయక్ తండావాసులు

తెలంగాణ వాదాన్ని అడ్డం పెట్టుకుని రక్షించుకునే యత్నం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని

చివ్వెంల(సూర్యాపేట) : లిక్కర్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన కేసీఆర్ కుటుంబ సభ్యులను తెలంగాణ వాదాన్ని అడ్డం పెట్టుకుని రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్‌లో ఆయుష్మాన్ భారత్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు వేలకోట్ల రూపాయలు అక్రమార్జనే ధ్యేయంగా లిక్కర్ కుంభకోణానికి పాల్పడి ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, జంపాల వెంకటేశ్వర్లు, ఉప్పోజు వీరాచారి, ధరావతు అశోక్, తండు సైదులు, దండ సతీష్, వీరస్వామి, మల్లయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 12వ వార్డులో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరితే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుందని, పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటే ప్రతి కుటుంబాన్ని ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీద్, కౌన్సిలర్ కట్కూరి కార్తీక్‌రెడ్డి, జిల్లా నాయకులు తుక్కాని మన్మథరెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన గీతకార్మికుడు మృతి

చింతపల్లి : తాటిచెట్టుపై నుంచి కింద పడడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతిచెందాడు. ఎస్ఐ బాలకిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధనాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముద్దం వెంకటయ్య(53) గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 12న తాటికల్లు కోసం చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య పోశమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

- డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కొని ఒకరి మృతి.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- బస్సులోని ప్రయాణికులు క్షేమం

చౌటుప్పల్ : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా పైడిచింతపాడు గ్రామానికి చెందిన సిర్దు బాలకృష్ణ(42) తన డీసీఎంలో కూరగాయలను లోడు చేసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కే వెళ్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లింగోజిగూడెం శివారులోని ఓ హోటల్ ఎదురుగా ప్రయాణికుల మూత్ర విసర్జనకు బస్సును రోడ్డు వెంట ఆపాడు. ఆ సమయంలో డీసీఎం వాహనం ఆర్టీసీ బస్సు వెనుక నుండే వస్తుంది. ఎలాంటి ముందస్తు సంకేతాలు ఇవ్వకుండా బస్సును నిలపడంతో డీసీఎం డ్రైవర్ శ్రీనివాస్ వేగంగా వెళ్లి వెనుకనుంచి దానిని ఢీకొట్టాడు. దీంతో డీసీఎంలోని ఇద్దరు క్యాబిన్‌లో ఇరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. క్యాబిన్ నుంచి ఇద్దరిని బయటకు తీశారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని బాలకృష్ణ మృతదేహాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించి నివాళులు అర్పించారు. ఇదిలా ఉండగా ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలవ్వలేదు.



బాలకృష్ణ మృతదేహం



క్యాబిన్‌లో ఇరుకున్న క్షతగాత్రులను బయటికి తీస్తున్న పోలీసులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ : గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వాడపల్లి ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన తొడోజు గోవిందాచారి(63) మద్యానికి బానిసై రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని బస్టాప్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గోవిందాచారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంలో జాగ్రత్తలే కీలకం

- వేసవిలో వ్యాధులు సోకే అవకాశం
- బద్దె పురుగు అత్యంత ప్రమాదకరం
- వ్యాధి నిరోధక శక్తి, గుడ్ల ఉత్పత్తి, పెరుగుదలపై ప్రభావం
- వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దవూర పశువైద్యాధికారి చంద్రబాబు సూచనలు



చంద్రబాబు, పశువైద్యాధికారి

పెద్దవూర : వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ ఆ తర్వాత కోళ్ల పెంపకానిదే. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో నాటుకోళ్లను సాకుతారు. ఎవరైనా బంధువులు వచ్చినా, పండుగలకు, పబ్బాలకు ఇంట్లో పెంచుకున్న కోళ్లను కోసి ఆరగిస్తుంటారు. ప్రస్తుతం నాటుకోళ్ల ట్రెండు నడుస్తోంది. ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ సారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వేడి పెరిగే కొద్ది కోళ్ల ఫారం యజమానులు, పెరటి కోళ్ల యజమానులు వాటి రక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం ఆలస్యం చేసినా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా వేసవిలో బద్దె పురుగు వ్యాధి ప్రబలుతుంది. ప్రమాదకర ఈ వ్యాధి నుంచి కోళ్లను రక్షించుకునేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు సూచిస్తున్నారు.. వివరాలు ఆయన మాటల్లోనే..

బద్దె పురుగు నేపథ్యం..

పరాన్న జీవులు రెండు రకాలు. అవి అంతర పరాన్న జీవులు, బాహ్యపరాన్న జీవులు. బద్దె పురుగుల వంటి అంతర పరాన్న జీవులు కోళ్ల పేగుల్లో నివసిస్తూ వాటి పోషక పదార్థాలను సుష్టిగా హరించి వేస్తూ, జీవాల్లో ఉత్పాదక శక్తిని తగ్గిస్తాయి. చివరకు వాటిని బలహీన పరిచి పెరుగుదల లేకుండా చేస్తాయి. బద్దె పురుగులు తెల్లగా సన్నటి రిబ్బను లాంటి శరీర సౌష్టవం కల్గి ఉంటాయి.



ఇంటిలో పెంచుతున్న నాటు కోళ్లు

వ్యాధి సంక్రమించే విధానం

కొన్ని రకాల చీమలు, ఈగలు, మిడతలు, పేడపురుగు, నేలపై తిరిగే నత్తలు కోడి పెంటలోని బద్దె పురుగుల గుడ్లను తినడంతో వాటి లార్వాదశ ఈ కీటకాల్లో పెరుగుతుంది. కోళ్లు ఈ కీటకాలను తిన్నప్పుడు లార్వాదశ పేగుల్లో పెరిగి బద్దెపురుగులా మారుతాయి.

కలిగే హాని..

చిన్న వయస్సులో కోళ్లకు ఎక్కువగా ఈ బద్దె పురుగుల వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన కోళ్ల కాళ్లలో నిస్సత్తువ, పెరుగుదల లేకపోవడం, ఎక్కువ నీరు తాగడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అతి చిన్న బద్దె పురుగులు పేగు గోడల లోనికి చొచ్చుకొని పోవడంతో రక్త స్రావం కలిగి కోళ్లు చనిపోతుంటాయి. మరి కొన్ని పేగులపై చిన్న చిన్న గడ్డలు ఏర్పరుస్తాయి. బద్దె పురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండి పేగుల్లో ఆహార కదలికకు అడ్డుపడడమేకాక, వాటి ఒత్తిడితో పేగులు బద్దలై కోళ్లు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పురుగుల వలన రోగనిరోధక శక్తి తగ్గి ఇతర వ్యాధుల టీకాలు వేసినా సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చు.

పాడి పంట

రోగ నిర్ధారణ ఇలా..

కోళ్ల గుంపులో ఎదుగుదల లేకున్నా, గుడ్ల ఉత్పత్తి తగ్గినా బద్దెపురుగుల వ్యాధి ఉందని గ్రహించాలి. కోడిపెంటలో బద్దె పురుగుల శరీర ఖండాలు బియ్యపు గింజల్లాగా కనిపిస్తాయి. వ్యాధి నిర్ధారణకు ఒక కోడిని కోసి అందులోని పేగులను చూస్తే బద్దె పురుగులు కనిపిస్తాయి.

చికిత్స నివారణ చర్యలు..

ఈ వ్యాధి సోకితే కిలో బరువుగల కోడికి బ్యూటినోరెట్ 150 మిల్లి గ్రాములు, డైక్లోరోఫెన్ 200 గ్రాములు దాణాలో ఇవ్వాలి. మెబెండజోల్ పౌడర్ వంద కోళ్లకు 10 మి.గ్రా. చొప్పున దాణాలో ఇవ్వాలి. ఫెన్‌బెండజోల్, ప్రాజిక్వాంటాల్ వంటి ఇతర మందులను కూడా వాడవచ్చు. అలాగే కోళ్లు పెంచే ప్రాంతాల్లో కీటకాలు వ్యాప్తి చెందకుండా డెల్టామెత్రిన్ అనే మందు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేకపోతే ఫినాల్, సైథియాన్ వంటి క్రిమి సంహారక మందులను నీటిలో కలిపి కోళ్ల షెడ్డు లోపల చుట్టు పక్కల పిచికారీ చేయాలి.